సాక్షి
అనంతపురం
ఆదివారం । 27 । ఆగస్టు । 2023



టన్ను చీనీ రూ.16,500
అనంతపురం మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16,500, కనిష్టం రూ.5 వేలు, సరాసరిన రూ.11 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.20
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.20 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 4,500 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
36.4°/22.9°
జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.


న్యూస్‌రీల్

జిల్లాకు 1,328 మెట్రిక్ టన్నుల ఎరువులు



అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు ఫ్యాక్ట్ కంపెనీ నుంచి 1,328 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు చేరినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. శనివారం ఆయన ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌లో రేక్‌పాయింట్‌కు వెళ్లి వ్యాగన్ల ద్వారా సరఫరా అయిన ఎరువులను పరిశీలించి అన్‌లోడ్ చేయించారు. 887 మెట్రిక్ టన్నుల అమ్మోనియం సల్ఫేట్, 20-20-0-13 రకం కాంప్లెక్స్ ఎరువులు 441 మెట్రిక్ టన్నులు వచ్చాయన్నారు. కలెక్టర్, జేసీ, డీఏఓ ఆదేశాల మేరకు ఇండెంట్ ప్రకారం మొదటి ప్రాధాన్యతగా ఆర్‌బీకేలు, సొసైటీలు, హోల్ సేల్ డీలర్లకు సరఫరా చేయడంతో పాటు మిగతావి మార్క్‌ఫెడ్, కంపెనీ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు తెలిపారు.

1,600 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ విత్తనాలు



అనంతపురం అగ్రికల్చర్: ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలో భాగంగా శనివారం నాటికి 1,500 క్వింటాళ్ల ఉలవలు, 100 క్వింటాళ్ల అలసంద విత్తనాలు ఆర్‌బీకేల్లో నిల్వ చేశామని ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ ధనలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం, కూడేరు, గార్లదిన్నె, వజ్రకరూరు, ఉరవకొండ, గుత్తి, ఆత్మకూరు, కళ్యాణదుర్గం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, బెళుగుప్ప మండలాల్లో నిల్వ చేశామని తెలిపారు. త్వరలోనే 80 శాతం రాయితీతో రైతులకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

ఇద్దరిపై పీడీ యాక్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: తాడిపత్రికి చెందిన ఇద్దరు రౌడీషీటర్లపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ అనుమతితో ఈ నిర్ణయం తీసుకున్నారు. తాడిపత్రికి చెందిన టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, రౌడీషీటర్ అయిన సోమశేఖర్‌నాయుడిపై మొత్తం ఏడు కేసులు ఉన్నాయి. షేక్ ఖాజా అలియాస్ కాశాపై కూడా రౌడీషీట్‌తో సహా నాలుగు కేసులు ఉన్నాయి. వీరిద్దరిపై పోలీసులు పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి తాడిపత్రి నుంచి అనంతపురం తీసుకువచ్చినట్లు తెలుస్తోంది.

రైతు ప్రయోజనాలే ధ్యేయం

- ప్రత్యామ్నాయ పంటలపై రైతుల్లో చైతన్యం తేవాలి
- వ్యవసాయ శాఖ అధికారులకు మంత్రి ఉషశ్రీచరణ్ ఆదేశం



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి, సీఈఓ కేతన్‌గార్గ్ తదితరులు

అనంతపురం సిటీ: రైతుల విస్తృత ప్రయోజనాలే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పునరుద్ఘాటించారు. ఉమ్మడి జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అదను దాటినందున ప్రధాన పంటల స్థానంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతుల్లో చైతన్యం తేవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అనంతపురంజెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, అనంతపురం కలెక్టర్ గౌతమి, జెడ్పీ సీఈఓ/జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ చేతన్, ట్రైనీ కలెక్టర్ కుషాల్ జైన్, డిప్యూటీ సీఈఓ లలితాబాయి హాజరయ్యారు. వైద్య ఆరోగ్య, డీఆర్‌డీఏ, హౌసింగ్ శాఖలపై చర్చ నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పని తీరుపై సభ్యులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తమ శాఖ ప్రగతి నివేదికను చదివి వినిపిస్తుండగా.. సభ్యులు అభ్యంతరం తెలిపారు. అదను దాటిపోయినా పదును కాకపోవడంతో చాలా మంది రైతులు ప్రధాన పంట వేరుశనగ సాగు చేయలేకపోయారని సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి జోక్యం చేసుకుంటూ జూన్, జూలై నెలల్లో ఏయే పంటలు సాగు చేశారు? వాటి పరిస్థితి ఏమిటో వివరించాలని కోరారు. కూడేరు జెడ్పీటీసీ సభ్యురాలు బీఎస్ అశ్విని తమ నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితులతో పాటు విద్యుత్ కోతల గురించి సభలో ప్రస్తావించారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతుల్లో చైతన్యం తీసుకురావాలని గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యుడు మహేశ్ కోరారు. జేసీ కేతన్ గార్గ్ స్పందిస్తూ రాగి, జొన్న, కొర్రలు సాగు చేసే రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీడీపీ హయాంలో పంపిణీ చేసిన రెయిన్‌గన్లు, స్ప్రింక్లర్లు బడా రైతులు, ఆ పార్టీ నేతల ఇళ్లల్లో ఉండిపోయాయని, వాటిని రికవరీ చేసి చిన్న, సన్న కారు రైతులకు పంపిణీ చేయాలని బెళుగుప్ప ఎంపీపీ పెద్దన్న డిమాండ్ చేశారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీపై మండిపాటు..

కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల తీరుపై సభ్యులు మండిపడ్డారు. అనంతపురంలో ప్రైవేటు, కార్పొరేట్ వైద్యశాలల్లో రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆత్మకూరు ఎంపీపీ హేమలత ధ్వజమెత్తారు. అంబులెన్సుల్లో ఆక్సిజన్ సౌకర్యం ఉండేలా చూడాలని అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ డిమాండ్ చేశారు. నార్పల పీహెచ్‌సీలో స్కానింగ్ మిషన్‌ను వినియోగంలోకి తేవాలని జెడ్పీటీసీ సభ్యురాలు నాగరత్నమ్మ అడిగారు. లేపాక్షి పీహెచ్‌సీలో గైనకాలజిస్ట్‌ను అందుబాటులో ఉంచాలని జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి కోరారు. ఓడీచెరువు పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరిందని జెడ్పీటీసీ సభ్యుడు కుర్లి దామోదర్ రెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. రొద్దంలో పీహెచ్‌సీ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ చంద్రశేఖర్ కోరారు.

యానిమేటర్ల తీరుపై గరంగరం..

డ్వాక్రా సంఘాల్లో కీలకపాత్ర పోషిస్తున్న యానిమేటర్లు లక్షలాది రూపాయలు పక్కదారి పట్టిస్తూ, మహిళలను మోసం చేస్తున్నారని బుక్కరాయసముద్రం, యల్లనూరు, లేపాక్షి, గుడిబండ జెడ్పీటీసీ సభ్యులు భాస్కర్, విజయప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, భూతరాజు ఆరోపించారు. కొందరు 70, 80 ఏళ్లు దాటినా వారి ఆధార్ కార్డుల్లో 40-45 ఏళ్లుగా ఉండడంతో పింఛన్లు అందుకోలేకపోతున్నారని, ఆ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ గౌతమిని లేపాక్షి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి కోరారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లను నియమించండి ..

జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగాలంటే తగినంత మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లను నియమించాలని అమడగూరు, ఓడీసీ జెడ్పీటీసీ సభ్యులు కవిత, దామోదర్‌రెడ్డి కోరారు. ఉరవకొండలో 500 ఇళ్లు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని, వారికి ప్రత్యామ్నాయంగా మరోచోట పట్టాలివ్వాలని ఎంపీపీ చంద్రమ్మ విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను సత్వరం పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని మంత్రి ఉషశ్రీచరణ్ ఆదేశించారు. 'నాడు-నేడు' కింద అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు చేపడుతున్నామని, మరో దశలో ప్రహరీలు నిర్మిస్తామని తెలిపారు. అంగన్‌వాడీల్లో మరుగుదొడ్లు ఎక్కడైతే లేవో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్ఓల ప్లాంట్ల ఏర్పాటుకు సీడీపీఓల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలన్నారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. 15వ ఫైనాన్స్ కింద రూ.20 కోట్లతో తాగునీరు, డ్రెయినేజీ, రహదారులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. చాలా ప్రాంతాల ఆస్పత్రుల్లో వైద్యుల పనితీరు, 108 అంబులెన్స్ సేవలపై ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు కూడా ఇళ్ల నిర్మాణాలు పూర్తికి లబ్ధిదారులతో మాట్లాడాలన్నారు.



సర్వసభ్య సమావేశానికి హాజరైన ఉమ్మడి అనంతపురం జిల్లా సభ్యులు

సమన్వయంతో పనిచేయాలి

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తామని, దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో పట్టా ఇస్తామని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు. గడువులోగా కట్టుకోకుంటే ఇళ్లు రద్దు చేసి, మిగిలిపోయిన పేదలకు కేటాయిస్తామన్నారు.

వైద్యంపై అవగాహన కల్పించండి



ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో 'నాడు-నేడు' కింద చేపట్టిన పనులు, వచ్చిన మార్పులు, ఏ స్థాయి ఆస్పత్రుల్లో ఎవరెవరు ఉంటారు, ఎలాంటి సేవలందుతాయన్న అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. వైద్య రంగానికి సీఎం జగన్ ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తుకు ఈనెల 31వ తేదీ వరకూ గడువు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ ఎం.నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి దరఖాస్తుకు ఈ నెల 25వ తేదీ వరకే గడువు ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో కొందరు దరఖాస్తు చేసుకోలేకపోయారు. దీంతో గడువు పొడిగించామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

కుష్టు వ్యాధిపై సర్వే చేపట్టాలి



సమీక్షలో మాట్లాడుతున్న కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్

అనంతపురం క్రైం: జిల్లాలోని వివిధ పాఠశాలల్లో కుష్టు వ్యాధిపై సర్వే చేపట్టాలని కుష్టు విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ పేర్కొన్నారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆ విభాగం సిబ్బందితో ఆమె నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికల్లా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో సర్వే పూర్తి చేయాలన్నారు. కుష్టు వ్యాధి వల్ల వైకల్యం బారినపడిన వారిని గుర్తించి శస్త్రచికిత్స చేయించాలన్నారు. మైక్రోసెల్యూలర్ రబ్బర్ చెప్పులు అవసరమైన వారిని గుర్తించి, వారి ఫుట్ ప్రింట్స్ తీసుకోవాలని, వారి వివరాలను డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపాలని సూచించారు. కొత్తగా నమోదైన కుష్టు కేసులన్నీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ అన్వర్‌బాషా, పారా మెడికల్ అధికారి నాగన్న, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్యనారాయణ, డిప్యూటీ పారా మెడికల్ అధికారి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన కసాపురం



హనుమద్‌వాహనంపై సీతారామలక్ష్మణులను కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం శ్రావణ మాస రెండో శనివారం భక్తులతో పోటెత్తింది. శనివారం వేకువజామునే నెట్టికంటి ఆంజనేయ స్వామికి మహాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వర్ణకవచ అలంకరణ, ప్రత్యేక పుష్పాలతో అందంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక పూజల తర్వాత స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు బెల్దోణ సత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సీతారామలక్ష్మణులను హనుమద్ వాహనంపై కొలువుదీర్చి ఆలయ ఈఓ డి.వెంకటేశ్వరరెడ్డి, పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత స్వామివార్లను పల్లకీపై కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు.

పేదల చదువులకు భరోసా

- రేపు జగనన్న విద్యా దీవెన సొమ్ము విడుదల
- ఉమ్మడి జిల్లాలో 74,981 మంది విద్యార్థులకు లబ్ధి
- 68,604 మంది తల్లుల ఖాతాలకు జమ కానున్న రూ.51.19 కోట్లు



జగనన్న విద్యా దీవెన పొందుతున్న విద్యార్థుల వివరాలు

కులం	విద్యార్థులు	తల్లులు	నిధులు
ఎస్సీ	12,341	11,230	రూ. 8.43 కోట్లు
ఎస్టీ	3,855	3,425	రూ. 2.78 కోట్లు
బీసీ	38,627	35,208	రూ.25.34 కోట్లు
కాపు	4,773	4,451	రూ. 3 కోట్లు
ఈబీసీ	8,205	7,667	రూ.7.13 కోట్లు
ముస్లిం మైనార్టీ	7,051	6,462	రూ.4.43 కోట్లు
క్రిస్టియన్ మైనార్టీ	129	116	రూ.8.62 లక్షలు

అనంతపురం రూరల్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క విద్యార్థీ ఉన్నత చదువులకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారు. అందులో 'జగనన్న విద్యా దీవెన' పథకం ఒకటి. ఈ పథకం ద్వారా బీటెక్, బీ ఫార్మసీ, ఎంటెక్, ఎం ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ (జగనన్న విద్యా దీవెన) అందుతుంది. ఏ త్రైమాసికానికి సంబంధించిన కళాశాలల ఫీజులు ఆ త్రైమాసికంలోనే చెల్లిస్తుండటంతో పేద విద్యార్థుల చదువులు సాఫీగా సాగుతున్నాయి. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడో విడత 'జగనన్న విద్యా దీవెన' సొమ్మును ఈ నెల 28న సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగమోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా నగరి బహిరంగ సభలో కంప్యూటర్ బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేయనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 68,604 మంది తల్లుల ఖాతాలకు రూ.51.19 కోట్ల సాయం జమ కానుంది. మొత్తం 74,981 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

సీఎంకు రుణపడి ఉంటాం



పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం. విద్యా దీవెన పథకం ద్వారా సకాలంలో కళాశాల ఫీజులు చెల్లిస్తున్నాం. - ఫాతిమా మేరీ, డిగ్రీ ఫైనలియర్

సాఫీగా ఉన్నత చదువులు



ప్రభుత్వం అందిస్తున్న జగన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో ఉన్నత చదువులకు ఆర్థిక భరోసా కలుగుతోంది. క్రమం తప్పకుండా ఫీజులు చెల్లిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.
-షేక్ గౌసియా, బీటెక్ మూడో సంవత్సరం

అర్హులందరికీ పథకం వర్తింపు



అర్హులైన విద్యార్థులకు జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన పథకాలు వర్తింపచేయడానికి అన్ని చర్యలూ తీసుకున్నాం. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా చదువుకోవాలి. - మధుసూదన్, సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్

నేటి నుంచి గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ మీట్

అనంతపురం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత నెల 17 నుంచి ఈ నెల 18వ తేదీ వరకూ ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏరియా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన వారికి ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకూ కేంద్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆర్డీటీ పరిధిలోని బుక్క రాయసముద్రం, బత్తలపల్లి, కదిరి, కళ్యాణదుర్గం, ఉరవకొండ, మడకశిర, శ్రీశైలం, ఆదోని ప్రాంతాల నుంచి అండర్-15 విభాగానికి చెందిన 350 మందికి పైగా బాలికలు తరలివచ్చారు. 100, 200, 400, 4 x 100 మీటర్ల రిలే పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లతో సహా ఆరు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. మద్యం తాగొద్దన్నందుకు ఓ వ్యక్తి, ఆర్థిక ఇబ్బందులు తాళలేక మరో యువకుడు ఆత్మహత్య చేసుకోగా.. ఇతరుల డబ్బు అవసరాలకు ష్యూరిటీ పడిన పాపానికి వడ్డీ వ్యాపారులు వేధిస్తుండడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసి, చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. అలాగే తన పొలంలో దాయాదులు అడుగుపెట్టనివ్వడం లేదంటూ మరో మహిళా రైతు ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు..


మృతుడు నారాయణస్వామి, రాహుల్‌తేజ (ఫైల్) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగలక్ష్మి, ప్రసన్నకుమార్

- మరో ఇద్దరి ఆత్మహత్యాయత్నం
- చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న బాధితులు

• **యల్లనూరు:** మండలంలోని మల్లాగుండ్ల గ్రామానికి చెందిన బోయ నారాయణస్వామి(40), లక్ష్మీదేవి దంపతులు. వీరి కుమారుడు మూడు నెలల క్రితం గడ్డంవారిపల్లి చెరువులో నీటిని తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. అప్పటి నుంచి నారాయణస్వామి అతిగా మద్యం సేవించడం మొదలు పెట్టాడు. పలుమార్లు భార్య లక్ష్మీదేవి ప్రాధేయపడిన మద్యం తాగడం మానలేదు. దీంతో విసుగు చెందిన ఆమె ఇటీవల తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన నారాయణస్వామి శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రామకృష్ణ, ఏఎస్‌ఐ సంపత్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

• **పామిడి:** స్థానిక హనుమాన్ టాకీస్ రోడ్డులో నివాసముంటున్న రాహుల్‌తేజ అలియాస్ రాజా (32), నిఖిత దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న రాజా... ఆర్థిక ఇబ్బందుల కారణంగా తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం బడికెళ్లి పిల్లలను పిలుచుకురావాలంటూ భార్యను పంపి, ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

మహిళారైతు ఆత్మహత్యాయత్నం

రాప్తాడు రూరల్: తన భూమిలో సాగు చేసుకోనివ్వకుండా బావ అడ్డుపడుతున్నాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ మహిళ శనివారం అనంతపురం రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలు.. ఇటుకలపల్లి గ్రామానికి చెందిన పెద్దనరసింహులు, చిన్న నరసింహులు, గురుస్వామి అన్నదమ్ములు. చిన్ననరసింహులు, గురుస్వామికి పక్కపక్కనే ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉంది. కరోనా సమయంలో గురుస్వామి మృతి చెందడంతో ఆయన పేరుపై ఉన్న రెండు ఎకరాలను భార్య జింకా నాగలక్ష్మి పేరున ఆన్‌లైన్ రికార్డు చేసి, పట్టాదారు పాసుపుస్తకాన్ని అధికారులు అందజేశారు. అయితే వీరికి పిల్లలు లేకపోవడంతో ఆ భూమిపై కన్నేసిన చిన్న నరసింహులు ఎలాగైనా దక్కించుకోవాలని రెండేళ్లుగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఇదే విషయాన్ని పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఆమెట విన్నవించింది. దీంతో చిన్న నరసింహులును ఇటీవల అధికారులు పిలిపించి ఆ భూమిని నాగలక్ష్మి సాగు చేసుకుంటుందని, ఈ విషయంగా ఎలాంటి ఇబ్బంది పెట్టకూడదంటూ హెచ్చరించారు. అయితే ఆ భూమిలో తాను మామిడి మొక్కలు నాటానని తనకు 15 రోజులు గడువు ఇవ్వాలని చిన్న నరసింహులు కోరాడు. అయితే భూమిలో కాలు పెట్టనివ్వకుండా చిన్న నరసింహులు అడ్డుకుంటుండడంతో మనస్తాపం చెందిన నాగలక్ష్మి శనివారం ఉదయం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంది. ఆ సమయంలో ఆర్డీఓ సమావేశంలో అధికారులందరూ ఉన్నారని అటెండర్ తెలపడంతో మనస్తాపం చెందిన నాగలక్ష్మి తన వెంట తెచ్చుకున్న క్రిమి సంహారక మందు తాగింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంటనే ఆమెను తన వాహనంలోనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతోంది.

పురుగుల మందు తాగి, బ్లేడ్‌తో గొంతు కోసుకుని

గార్లదిన్నె: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఓ యువకుడు పురుగుల మందు తాగి, బ్లేడుతో చేతులు, గొంతు కోసుకున్నాడు. వివరాలు.. శింగనమల మండలం చిన్నజలాలపురానికి చెందిన వెంకటనారాయణ అనే వ్యక్తి గార్లదిన్నె మండలం ఇల్లూరులో ఉన్న తన అల్లుడు గంగాధర్‌కు కల్లూరుకు చెందిన చౌడప్ప నుంచి రూ.45 లక్షలు అప్పు ఇప్పించాడు. అయితే గంగాధర్ అప్పు చెల్లించలేకపోవడంతో ష్యూరిటీ పడిన వెంకటనారాయణను అప్పు చెల్లించాలని చౌడప్ప అడుగుతుండేవాడు. ఈ క్రమంలో అప్పు చెల్లించలేక ఇటీవల వెంకటనారాయణ గ్రామాన్ని వదిలి బుక్కరాయసముద్రానికి మకాం మార్చాడు. అయితే తన అప్పు తీర్చడంలో నిర్లక్ష్యం చేస్తున్నారంటూ పోలీస్ స్పందన కార్యక్రమంలో చౌడప్ప ఇచ్చిన అర్జీ మేరకు బుక్కరాయసముద్రం, గార్లదిన్నె పోలీసులు స్టేషన్‌కు పిలుచుకెళ్లి విచారణ చేశారు. దీంతో కుటుంబ పరువు పోయిందని భావించిన వెంకటనారాయణ కుమారుడు ప్రసన్నకుమార్ శనివారం గార్లదిన్నె పోలీస్ స్టేషన్ ఎదుట పురుగుల మందు తాగాడు, అనంతరం బ్లేడుతో చేతుల మీద, గొంతుపై కోసుకొన్నాడు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే గార్లదిన్నె పీహెచ్‌సీకి తరలించి, ప్రథమ చికిత్స అందజేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు.

సినిమా సందడి


లెక్చరర్లతో ఆర్.నారాయణ మూర్తి

అనంతపురం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సినీనటుడు, నిర్మాత ఆర్.నారాయణ ర్తి బృందం శనివారం సందర్శించింది. యూనివర్సిటీ పేరుతో తీసిన చిత్రం ప్రమోషన్ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి, అధ్యాపకులతో కాసేపు సరదాగా గడిపారు.

దళారీపై చర్యలు తీసుకోండి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత రైతులు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

కణేకల్లు: ఎంతో నమ్మకంగా ఉంటూ పంట ఉత్పత్తులు కొనుగోలు చేసి డబ్బు ఇవ్వకుండా మోసం చేసిన దళారీపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. వివరాలు... కణేకల్లు మండలంలోని పలువురు రైతుల నుంచి దళారీ దేవప్పగారి కృష్టారెడ్డి, ఆయన కుమారుడు సోమశేఖర్ శనగ పంట కొనుగోలు చేశారు. ఎంతో నమ్మకంగా తమతో కలసి ఉండడంతో వారిపై ఎలాంటి అనుమానాలు లేకుండా రైతులు పంట ఉత్పత్తులు అప్పగించారు. ఈ నమ్మకాన్ని వమ్ము చేస్తూ చివరకు డబ్బు ఇవ్వకుండా తండ్రీకొడుకు ఉడాయించారు. విషయం తెలుసుకున్న పెనకలపాడు గ్రామానికి చెందిన బాధిత రైతులు రామాంజినేయులు, అనిల్‌కుమార్, ఎస్కే మల్లికార్జున, శేషప్ప, ఎస్కే దివాకర్, వాదే జయన్న, తలారి రామాంజినేయులు, కురుబ నాగభూషణ, నాగార్జున, కుళ్లాయిస్వామి, పూజారి మారెప్ప, విశ్వనాథ్, శివలింగప్ప, నాగరాజు, ఎం.ఎర్రిస్వామి, సిద్దారెడ్డి, జయపాల్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, తదితరులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. దళారీ కృష్టారెడ్డి, ఆయన కుమారుడు సోమశేఖర్‌పై చర్యలు తీసుకుని తమకు డబ్బు ఇప్పించాలంటూ ఫిర్యాదు చేశారు. దళారీలు మోసం చేయడంతో అప్పులు తీర్చే మార్గం కానరావడం లేదన్నారు.

పోక్సో కేసు నమోదు

బొమ్మనహాళ్: కణేకల్లు మండలం ఉడేగోళం గ్రామానికి చెందిన యువకుడిపై లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం (పోక్సో) కింద కేసు నమోదైంది. ఈ మేరకు ఎస్‌ఐ శివ శనివారం వెల్లడించారు. బొమ్మనహాళ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనతోపాటు ఉడేగోళానికి చెందిన మహేష్ తీసుకెళ్లాడు. దీనిపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మహేష్‌పై బాలిక కిడ్నాపింగ్‌తో పాటు పోక్సో కింద కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'సెక్టోరియల్' ఇన్‌చార్జ్‌ల నియామకం

రాప్తాడురూరల్: సమగ్ర శిక్ష కార్యాలయంలోని వివిధ సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల పోస్టులకు ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జ్ ఏఎంఓగా చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ జీసీడీఓగా మహేశ్వరి, ఇన్‌చార్జ్ అసిస్టెంట్ అలెస్కోగా కె.గోవిందరెడ్డి, ఇన్‌చార్జ్ ఏఎస్‌ఓగా కె.రామ్‌ప్రసాద్‌రెడ్డిని నియమించారు. వీరంతా విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ ఏఎంఓగా పని చేస్తున్న హరికృష్ణ, జీసీడీఓ వాణీదేవి ఇద్దరూ ఎంఈఓ-2గా వెళ్లారు. గతంలోనే అసిస్టెంట్ అలెస్కో, ఏఎస్‌ఓ పోస్టులు ఖాళీగా ఉండేవి. మొత్తం నాలుగు పోస్టులను భర్తీ చేయడంతో ఆయా విభాగాల్లో పనులు వేగవంతం కానున్నాయి.

వారిది దోపిడీ రాజకీయం

- కుమారుడిదేమో వీకెండ్ రాజకీయం
- తండ్రేమో నాయకుడినంటారు..
- వాళ్లను నమ్మితే దొంగతనాలకు లైసెన్స్‌లిస్తారు
- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి (చిత్రంలో) పైలా నరసింహయ్య

తాడిపత్రి: 'తండ్రేమో తాడిపత్రిలో ఉంటూ తాను ప్రజానాయకుడినని నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడు. కొడుకేమో వీకెండ్ రాజకీయాలు చేస్తుంటాడు. వీరిని నమ్ముకుంటే దొంగతనాలకు లైసెన్స్‌లు ఇస్తారు. దోపిడీ రాజకీయాలకు కేరాఫ్‌గా జేసీ ప్రభాకరరెడ్డి కుటుంబం నిలిచింది' అంటూ తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజమెత్తారు. ప్రజా సంక్షేమయాత్రలో భాగంగా 5వ రోజు శనివారం యాడికి మండలం రాయలచెరువులోని నగరూరు క్రాస్‌లో ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. జేసీ కుటుంబాన్ని ఆదరిస్తే వారు ప్రజల ఇళ్లలోని బంగారాన్ని దోచుకుంటారని మండిపడ్డారు. అంతేకాక దోపిడీకి లైసెన్సులు మంజూరు చూస్తూ దోచుకున్న సొత్తులో సగం వాటా దండుకుంటారన్నారు. తండ్రి నుంచి కుమారుడు కూడా డెకాయిట్ పనులు నేర్చుకుంటాడు కానీ నాయకత్వ లక్షణాలతో ప్రజల మెప్పు ఎలా పొందగలరో ఆలోచించాలన్నారు. రైతు బాగుపడితే జేసీకి గిట్టదన్నారు. వారి 30 ఏళ్ల రాజకీయ జీవితమే ఇందుకు నిదర్శనమన్నారు. రైతు బిడ్డగా అందరి కష్టాలు చూసి, నాయకుడిగా ఎదిగిన తనకు... వారసత్వ దోపిడీ విధానంతో ప్రజలను బెదిరించి నాయకుడిగా ఎదగాలనుకుంటున్న జేసీ ప్రభాకరరెడ్డి, ఆయన తనయుడికి ఎక్కడేగాని పోలిక లేదన్నారు. ప్రజల జీవితాలను ఫణంగా పెట్టి రాజకీయంగా ఎదగడం ఒక్కటే జేసీ సోదరులకు తెలుసునన్నారు. నారా లోకేష్‌కు లోకజ్ఞానం లేదన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి తనపై 74 కేసులు, కౌన్సిలర్లపై 24 కేసులు ఉన్నాయని చెప్పిన మాటలు నమ్మి వాటినే అలాగే చెప్పిన లోకేష్‌ను మించిన దద్దమ్మ ఈ లోకంలో ఎవరూ ఉండరన్నారు. జేసీ పేర్కొన్నట్లు ఈ నెల 28వ తేదీలోపు కేసులను నిరూపించకపోతే నీచ ప్రవృత్తి కలిగిన రౌడీషీటర్ సమాజంలో తిరిగితే ప్రమాదమని, ఇలాంటి వారు జైలులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరుతామన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి కుమారుడిపై మహారాష్ట్రలో ఉన్న కేసు గురించి ఏనాడూ పెదవి విప్పడన్నారు. అలాగే ఇతర రాష్ట్రాల్లో వారిపై ఉన్న కేసుల ఊసెత్తడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేమకల్లుకు పోటెత్తిన భక్తులు


దర్శించుకుంటున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: శ్రావణమాసం రెండో శనివారాన్ని పురస్కరించుకుని నేమకల్లు ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. స్వామివారి మూలవిరాట్‌కు ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, విశేష పుష్పాలు, వెండి కవచంతో శోభాయమానంగా అలకరించారు. ఆకుపూజలు, కుంకుమార్చనలతో భక్తులు మొక్కలు తీర్చుకున్నారు. భక్తులకు సాయిబాలాజీ స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పించారు. స్వామిని దర్శించుకున్న ప్రముఖుల్లో ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి, తనయుడు కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమాలను ఆలయ పాలక మండలి సభ్యులతో పాటు దేవదాయ శాఖ ఈఓ నరసింహారెడ్డి పర్యవేక్షించారు.

ముమ్మరంగా గండి పూడ్చివేత పనులు


గండి పూడ్చివేత పనులు చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: బళ్లారి జిల్లా కొలగల్లు గ్రామం వద్ద హెచ్చెల్సీ 78వ కిలోమీటర్ వద్ద శుక్రవారం రాత్రి పడిన గండి పూడ్చివేత పనులు వేగంగా సాగుతున్నాయి. కాలువ కుడిగట్టుకు గండిపడి సుమారు 15 మీటర్ల మేర తెగిపోయింది. ఆ సమయంలో కాలువలో 2,200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. నీటి ఉధృతకు కాలువ గట్టు మరింత ఎక్కువగా కోతకు గురైంది. డ్యామ్ నుంచి కాలువకు నీరు పూర్తిగా బంద్ చేశారు. సమాచారం అందుకున్న తుంగభద్ర డ్యామ్ ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. గండిని పూడ్చి వేసేందుకు భారీ యంత్రాలను రంగంలో దించారు. మరో రెండు రోజుల పాటు గండి పూడ్చి వేత పనులు సాగుతాయని ఈ సందర్భంగా తుంగభద్ర బోర్డు అధికారులు తెలిపారు.

గ్రామాలకు తాగునీటి సరఫరా బంద్

కూడేరు: మండలంలోని పీఏబీఆర్ వద్ద ఉన్న సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ పథకంలో పనిచేస్తున్న 572 మంది కార్మికులు రెండో రోజు శనివారమూ సమ్మె కొనసాగించారు. దీంతో ఈ ప్రాజెక్ట్ పరిధిలోని 1,200 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. కార్మిక సంఘం నేతలు శ్రీనివాసులు, సుంకన్న ,సైదామీస్, శ్రీనివాసులు నాయక్, వసికేరప్ప మాట్లాడుతూ.. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేపట్టినట్లు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న 5 నెలల వేతనాలతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్, బోనస్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మెను ఇలాగే కొనసాగిస్తామని హెచ్చరించారు.

రైతు మృతదేహం లభ్యం

ఉరవకొండ: మండలంలోని రాయంపల్లి వద్ద శుక్రవారం మధ్యాహ్నం హెచ్చెల్సీలో గల్లంతైన రైతు మల్లికార్జున మృతదేహమై తేలాడు. ఆయన మృతదేహాన్ని శనివారం నింబగల్లు సమీపంలోని హెడ్ రెగ్యులేటరీ వద్ద బంధువులు గుర్తించి, వెలికి తీశారు. పొలంలోకి వెళ్లే క్రమంలో కాలువను దాటుకుంటుండగా గల్లంతయ్యాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

9 మంది బీటర్ల అరెస్ట్

- రూ. 3,30,950 స్వాధీనం

తాడిపత్రి: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మట్కా రాస్తున్న 9 మంది బీటర్లను అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ హమీద్ ఖాన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో యల్లనూరు మండలం కోడుమూర్తి గ్రామానికి చెందిన గొంది మల్లికార్జున, తాడిపత్రికి చెందిన కొలిమి ప్రతాప్, హరిజన వాడకు చెందిన కొమ్ము రాజుకుళ్లాయప్ప, శివాలయం వీధికి చెందిన షేక్ చాంద్‌బాషా, షేక్ మహబూబ్ బాషా, గాంధీకట్ట వద్ద నివాసముంటున్న ఉదయగిరి మాబున్నీ, పుట్లూరు నివాసి నల్లఓబన్న గారి శివప్రసాద్, తిమ్మంపల్లి గ్రామానికి చెందిన వెన్నపూస చంద్రశేఖర్‌రెడ్డి, కోడవండ్లపల్లి గ్రామం ఉసోళ్ల మహేష్ ఉన్నారు. వీరి నుంచి రూ. 3,30,950 నగదుతో పాటు బాల్ పెన్నులు, 18 మట్కా పట్టీలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన టీటీడీ బోర్డు సభ్యుడు



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యుడు అశ్వర్థ నాయక్‌ను సన్మానించిన గిరిజన సంఘం నాయకులు

అనంతపురం క్రైం: నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నియమితులైన అశ్వర్థనాయక్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు అశ్వర్థనాయక్ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పలు అంశాలపై వారు చర్చించారు. గిరిజన సంఘం నాయకులు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని, అశ్వర్థ నాయక్‌ను శాలువా, పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు.

గిరిజనుల సంక్షేమానికి జగన్ కృషి

అనంతపురం కల్చరల్: గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతగా ఉంటామని ఆలిండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర నాయకులు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాల పాలక మండలి సభ్యుడిగా ఎన్నికైన సేవా ఘడ్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి అశ్వర్థ నాయక్‌ను శనివారం సన్మానించారు. కార్యక్రమంలో ఏఐబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ నాయక్, జిల్లా అధ్యక్షుడు బాలాజీ నాయక్,సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి బాబునాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ నాయక్, సేవాగడ్ ట్రస్టు ప్రతినిధులు బాలానాయక్ పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతకు సహకరించండి



పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్

అనంతపురం క్రైం: నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని మేయర్ వసీం నగర ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం 39వ డివిజన్‌లో జరుగుతున్న పూడికతీత పనులను మేయర్ పరిశీలించారు. పనులు జరిగే సమయంలో సంబంధిత పారిశుధ్య కార్యదర్శులు, సిబ్బంది పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారేయకూడదన్నారు. నగరాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఖాజా, నాగార్జునరెడ్డి, మధు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

అనంతపురం క్రైం: పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ రమణారెడ్డి పారిశుధ్య కార్యదర్శులు, కార్మికులను ఆదేశించారు. శనివారం నగరంలోని 3,4,5వ సర్కిళ్లలో అదనపు కమిషనర్ పర్యటించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో చెత్త తరలింపు వాహనాలను పరిశీలించి, వివిధ ప్రాంతాలకు పంపేలా చర్యలు తీసుకున్నారు.

ఫుడ్ సేఫ్టీ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా గుజ్జల లక్ష్మణ్‌కుమార్



అనంతపురం క్రైం: ఫుడ్ సేఫ్టీ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల లక్ష్మణ్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో లక్ష్మణ్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే అనంత వెంటకరామిరెడ్డి లక్ష్మణ్‌ను ఆదేశించారు. వైఎస్సార్‌సీపీలో తమలాంటి యువతకు అవకాశం కల్పించారని, అందుకు తగ్గట్టుగా పని చేస్తామని గుజ్జల లక్ష్మణ్ తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నల్లప్ప, శేఖర, పోలవీర, రాముడు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల ప్రైవేటీకరణ ఆపాలి



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వం రంగ బ్యాంకులను ప్రైవేటీకరించే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపాలని బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగిన సమన్వయ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న బ్యాంకింగ్ వ్యతిరేక వైఖరిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్రం ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రాంబాబు, ఉదయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రుషేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి మున్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



ఆర్ఎఫ్ రోడ్డు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏడు శనివారాల వ్రతం ఆచరిస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో శ్రావణ శనివారాల వ్రతం

అనంతపురం కల్చరల్: శ్రావణ మాసంలో ఏడు శనివారాల వ్రతాలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆర్ఎఫ్‌రోడ్డు, రామనగర్, హౌసింగుబోర్డులోని శ్రీ వేకంటేశ్వరస్వామి ఆలయాలతో పాటు శ్రీశారదా శృంగేరి శంకర మఠంలో ఏడు వారాల వ్రతాలకు ఏర్పాట్లు చేశారు. ప్రధాన వేదికపై పురోహితులు వేద మంత్రాలు చదువుతూ వ్రతాలు చేయిస్తుంటే ఏకరూప దుస్తులతో తమ ముందు ఏర్పాటు చేసుకున్న శ్రీవారి విగ్రహానికి అధిక సంఖ్యలో హాజరైన మహిళలు కుంకుమాభిషేకాలు, పుష్పార్చన, సామూహిక దీపార్చన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. అలాగే శ్రావణ శనివారం నగర శివార్లలోని శ్రీ శివబాలయోగి ఆశ్రమంలో శ్రీవారి లడ్డూ పడిపూజలు ఘనంగా జరిగాయి. ఆశ్రమ అధ్యక్షులు అరవింద్, రత్నగిరి దేవరాజ్ తదితరులు నిలువెత్తు శ్రీ వేంకటేశ్వరుడికి అలంకార సేవలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలందించారు.

పేదల ఆరోగ్యానికి సీఎం జగన్ భరోసా

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. శనివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొత్తం 30 మంది లబ్ధిదారులకు రూ.34.43 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఈ సాయం ద్వారా ఎందరో పేదలకు ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు సీఎం జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. గతంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ విషయంలో చాలా అలసత్వం ప్రదర్శించేవారన్నారు. కరోనా కష్టకాలంలోనూ 'సీఎం రిలీఫ్ ఫండ్' విషయంలో ఆలస్యం కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజనేయులు, పార్టీ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, చిట్రా వెంకటేష్, సుధీర్ రెడ్డి, పసుపుల ఆది, ఉప్పరపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్

అనంతపురం: విద్యార్థులు పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ అన్నారు. శనివారం జేఎన్‌టీయూ అనంతపురం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రపంచ ఔత్సాహిక పారిశ్రామిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా డాక్టర్ జి. మమత వ్యవహరించారు. జాతీయ నూతన విద్యా విధానం-2020 ప్రకారం ప్రతి విద్యార్థి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగేలా అంశాలను ప్రవేశపెట్టారన్నారు. ప్రతి విద్యార్థీ నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం కే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల విధానం-2023 గురించి వివరించారు. కార్యక్రమంలో క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఈ.అరుణాకాంతి, డాక్టర్ భువన విజయ, డాక్టర్ ఓం ప్రకాష్, డాక్టర్ కళ్యాణిరాధ, డాక్టర్ ఎం. అంకారావు, డాక్టర్ కేఎఫ్ భారతి తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిసా అడుగుజాడల్లో నడవాలి



మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం: ప్రతి ఒక్కరూ మదర్ థెరిసా అడుగుజాడల్లో నడవాలని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయం అనంతపురంలో మదర్ థెరిసా గారి 113వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమామోహన్ రెడ్డి, కార్యదర్శి పి.రమ హాజరయ్యారు. ముందుగా మదర్ థెరిస్సా చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. సంస్థ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మదర్ థెరిసా తన వ్యక్తి గత జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, ప్రకాశం జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి, ఇంతియాజ్ అహమ్మద్, రామాంజినమ్మ, మల్లికార్జున, సిబ్బంది, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం మదర్ థెరిస్సా

అనంతపురం క్రైం: సేవకు ప్రతిరూపం మదర్ థెరిస్సా అని మేయర్ వసీం అన్నారు. శనివారం మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకొని సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న మదర్ థెరిస్సా విగ్రహానికి పూల మాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇస్సాక్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, నాయకులు సతీష్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

నిస్సహాయులకు 'అమ్మ'సాయం



జగదీష్ కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: బుక్కరాయసముద్రం మండల కేంద్రానికి చెందిన నిస్సహాయ కుటుంబానికి 'అమ్మ' సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి శనివారం ఆర్థికసాయం చేశారు. మండల కేంద్రానికి చెందిన జగదీష్ బేల్దారిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతని అవయవాలను దానం చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయి అతని భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు నిస్సహాయులుగా మారారు. ఇల్లు గడవక కష్టాల్లో ఉన్న ఆకుటుంబానికి అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి మానవతాదృక్పథంతో ఆదుకున్నాడు. శనివారం బాధిత కుటుంబానికి పరామర్శించి, రూ.30వేలు నగదు, మరో రూ.25వేలు విలువజేసే వస్త్రాలు, నిత్యావసర వస్తువులు అందించారు. అనంతరం అమ్మ సంస్థ రమణారెడ్డి మాట్లాడుతూ చిన్నారులు అనాథలుగా మిగిలిపోకుండా భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.

పునరుత్పాదక శక్తి వనరులను వినియోగించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి

అనంతపురం: పునరుత్పాదక శక్తి వనరులను వినియోగించాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఇంజినీర్స్ ఇండియా అనంతపురం బ్రాంచ్ సంయుక్తంగా పర్యావరణహితమైన శక్తి అనే అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. సౌర విద్యుదుత్పత్తి, గాలిమరల ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్ శక్తిపై వివరించారు. కార్యక్రమంలో రెన్యూ పవర్ సీనియర్ ఇంజినీర్ రియాజ్ బాషా, ఇంజినీర్స్ ఇండియా అనంతపురం బ్రాంచ్ కార్యదర్శి డాక్టర్ ఎం.రామకృష్ణా రెడ్డి, జయశ్రీ ప్రసాద్, మహమ్మద్ ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రాల గురుమూర్తికి జాతీయ అవార్డు



చిత్రాల గురుమూర్తి

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన జ్యోతిష్య విద్వాంసులు చిత్రాల గురుమూర్తి విశ్వకర్మ లెజెండరీ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన జ్యోతిష్యం శాస్త్రబద్ధమైన గణిత విద్య అని నిరూపించే విధంగా దేశ వ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల్లో జరిగే చర్చల్లో పాల్గొంటున్నారు. ఆయన అనంత ఖ్యాతిని చాటి చెప్పున్నారు. గుప్త పంచాంగం ద్వారా ప్రసిద్ధులైన గురుమూర్తి సిద్ధాంతి చిన్నతనం నుంచే జ్యోతిష్య శాస్త్రంలో విశేష కృషి చేశారు. సాధారణంగా బ్రాహ్మణులకు మాత్రమే లభ్యమయ్యే విద్యలో ఆయన రాణిస్తూ అనేక గ్రంథాలు రచించి, పరిశోధక విద్యార్థులకు దిక్సూచిగా మారారు. ఆయన రచించిన 111 ఏళ్ల (1940 నుంచి 2050) శతాబ్ది పంచాంగం, గ్రహణ గతులు, తిథి వారాలను సూచించేందుకు ఎంతో మంది ప్రామాణికంగా అంగీకరించారు. గత 34 ఏళ్లుగా వాస్తు, పంచాంగ జ్యోతిష్యంలో పరిశోధనలు చేస్తున్న ఆయన.. బహుముఖ ప్రజ్ఞాశాలిగా వివిధ భాషల్లో ఇప్పటికే 36 గ్రంథాలను రచించారు. వివిధ యూనివర్సిటీల ద్వారా పలు రాష్ట్రాల్లో అనేక అవార్డులను అందుకున్నారు. ఆయన ఆలయ వాస్తులో జిల్లాలోనే కాకుండా వైఎస్సార్ జిల్లా తదితర చోట్ల కూడా అనేక ఆలయాలకు రూపకల్పన చేశారు. పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ నుంచి సంస్కృతం, తెలుగు, హిస్టరీ, జ్యోతిష్యంలో పట్టాలు అందుకున్నారు. అనంతకు చెందిన చిత్రాల గురుమూర్తి సిద్ధాంతిని 'విశ్వకర్మ లెజెండరీ' జాతీయ గౌరవ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు మాచవరం గౌరీ శంకరాచార్యులు, బాల బ్రహ్మాచారి తెలిపారు. సెప్టెంబర్ 10న విజయవాడలో జరగనున్న జాతీయ పురస్కారాల ప్రదానోత్సవంలో ఈ అవార్డును స్వీకరించనున్నారు.

రాష్ట్రస్థాయి ఎస్ఐపీలో ప్రతిభ కనబరచండి

గుంతకల్లుటౌన్: ఈ నెల 28 నుంచి 30 వరకు విజయవాడలో యూనిసెఫ్ నిర్వహిస్తున్న స్కూల్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్-2023లో అద్భుతమైన ప్రదర్శన ద్వారా తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని జిల్లా సైన్సు అధికారి యు.బాలమురళీ తెలిపారు. శనివారం స్థానిక రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. రాష్ట్రస్థాయి ఎస్ఐపీకి ఎంపిక కావడానికి అద్భుతమైన ప్రాజెక్టులను తయారు చేయించిన స్కూల్ సైన్స్ టీచర్ టి.తాజున్‌బీతో పాటు 9వ తరగతి విద్యార్థులు రోషన్, సుదర్శన్, రంజిత్‌కుమార్, అమీర్, యశ్వంత్‌ను డీఎస్ఓ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిసెఫ్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్ఐపీలో గుంతకల్లు రాజేంద్రప్రసాద్ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన ఆరు ప్రాజెక్టుల్లో రసాయన విభాగం ప్రాజెక్టు ఎంపిక కావడం సంతోషదాయకమన్నారు. రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆయన ఆకాంక్షించారు.

కొనసాగిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు



చెస్ పోటీలు జరుగుతున్న దృశ్యం

అనంతపురం: స్థానిక కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్-15 ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ ఛాంపియన్‌షిప్ - 2023 పోటీలు కొనసాగాయి. శనివారం ఆరో రౌండ్ పోటీలు నిర్వహించారు. ఆదివారం 7,8వ రౌండ్ పోటీలతో విజేతలను నిర్ణయిస్తారని చీఫ్ అర్బిటర్ ఫణి కుమార్ తెలిపారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నార్పల: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని బి.పప్పూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మహేంద్రనాథ్ పేర్కొన్నారు. శనివారం ఆయన హెచ్.సోదనపల్లిలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలతో విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాటమయ్య, ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ, పంచాయతీ కార్యదర్శి రాయుడు, వైద్యాధికారులు మల్లికార్జున, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

10 మందిపై కేసు నమోదు

గుత్తి: పట్టణంలోని దాసరి కాలనీ ఇంటి స్థలం విషయంపై జరిగిన ఘర్షణలో శనివారం 10 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇరు వర్గాలకు చెందిన రవి, సుజాత, నీలమ్మ, వెంకటరాముడు, పెద్ద వెంకటేష్, అశోక్, కృష్ణవేణి, సాయి కీర్తన, శ్రీనివాసులు, వసంతపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి



భూసార పరీక్షలపై తెలుసుకుంటున్న విద్యార్థులు

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు చదవుతో పాటు వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. శనివారం రెడ్డిపల్లి కేవీకేను అనంతపురానికిచెందిన 8,9,10వ తరగతి, ఇంటర్‌మీడియట్ విద్యార్థులు సందర్శించారు. ముందుగా కేవీకేలో చేపడుతున్న కార్యక్రమాలను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి వివరించారు. కేవీకేలో మట్టి నమూనాల కేంద్రం, సీడ్ ప్రాసెసింగ్ సెంటర్, షేడ్ నెట్ అజోల్ల, సమాచార కేంద్రం, వర్మీ కంపోస్ట్, పశువులు, గొర్రెల పెంపకం, వివిధ రకాల పంటల సాగుపై వివరించారు. రైతులకు పంటల సాగుపై నిత్యం సమాచారం అందిస్తూ శాస్త్రవేత్తలు పని చేస్తుంటారని తెలియజేశారు. కార్యక్రమంలో కేవీకే పశు పోషణ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ చందన, భూసార పరీక్ష కేంద్రం అధికారి ముత్యాల రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయశాస్త్ర విభాగంలో రమ్యకు డాక్టరేట్



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని న్యాయశాస్త్ర విభాగంలో పరిశోధన చేసిన వి. రమ్యకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఎస్ వీ పుల్లారెడ్డి పర్యవేక్షణలో 'డెత్ పెనాల్టి- విత్ స్పెషల్ రెఫరెన్స్ టు కమ్యూనికేషన్ ఆఫ్ డెత్ ఇన్ టూ లైఫ్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

పత్తిలో పచ్చదోమ నివారణపై దృష్టి పెట్టాలి

పెద్దవడుగూరు: పత్తి పంట సాగు చేసిన రైతులు పచ్చదోమ నివారణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏడీఏ వెంకట్రాముడు, ఏఓ మల్లీశ్వరి సూచించారు. శనివారం మిడుతూరు, పెద్దవడుగూరు గ్రామాల్లోని పత్తి పంట పొలాలను పరిశీలించారు. ప్రస్తుతం పత్తికి పచ్చదోమ అధికంగా సోకే అవకాశం ఉందని, నివారణకు ఫ్లోనికామిడ్ 0.4 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. లేదా డై ఫెంథురాన్ 0.3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తామర పురుగు నివారణ కు థయోమెథాక్సిమ్ 0.2 గ్రాములు లీటర్ నీటికి కలిపి లేదా స్పినెటోరమ్ 1మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రజిని, కైలాస్ , రైతులు, రైతుభరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఓనం వేడుకలకు ఏర్పాట్లు

అనంతపురం కల్చరల్: మలయాళీలకు ప్రీతికరమైన ఓనం వేడుకలు ఘనంగా నిర్వహించడానికి పాతూరు చెరువుకట్టపై వెలిసిన అయ్యప్పస్వామి ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు మణికంఠ మాట్లాడారు. మంగళవారం ఉదయం 5 గంటలకు గణపతి పూజతో ప్రారంభమై అభిషేకాలు, అలంకార సేవలు, సాయంత్రం స్వామివారి దివ్యదర్శనం, దీపారాధన, అప్పం పూజ, ప్రసాద వితరణ, హరివరాసనం ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ నాగలింగారెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్, రాము తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం 'రామదండు' భజనలు



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండల కేంద్రంలో వర్షం కురవాలని రామదండు భజనలు, పూజలు చేశారు. తెల్లవారు జామున 6 గంటలకే ఆత్మకూరు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆత్మకూరు, పి.యాలేరు, తిమ్మాపురం, కరుట్లపల్లి, సింగంపల్లి, పంపనూరు కొండ, పంపనూరు, కుర్లపల్లి గ్రామాల మీదుగా సీతారాముల చిత్ర పటాన్ని ఊరేగిస్తూ, కాలినడకన భజనలు చేస్తూ వెళ్లారు.

నేడు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం ఉంటుందని ఈఓ అక్కిరెడ్డి, కమిటీ చైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. స్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు, రాహుకేతు హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఉదయం 8 గంటల లోపు ఆలయంలో ఉండాలన్నారు.

శ్రీరామధూత స్మరణతో ఆత్మవిశ్వాసం

- స్వామి ఆత్మవిదానంద సరస్వతీ

అనంతపురం కల్చరల్: శ్రీరామధూత హనుమాన్ స్మరణతో ఎవరికైనా ఆత్మవిశ్వాసం రెట్టింపవుతుందని చిన్మయా మిషన్ జిల్లా ఇన్‌చార్జ్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి అన్నారు. సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 29న జరుగనున్న సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ ప్రచార వీడియోను ఆయన ఆవిష్కరించారు. స్థానిక కోర్టు రోడ్డులోని వరదాంజనేయస్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో స్వామీజీ మాట్లాడారు. దేవస్థానంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు గోదా విష్ణు సహస్రనామ మండలి సహకారంతో 108 సార్లు హనుమాన్ చాలీసా పఠనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపాల్, రాఘవేంద్రనాయక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

ఆత్మకూరు: ఆత్మకూరు పొలిమేర పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆదివారం నుంచి మూడు రోజుల పాటు పూజలు ఉంటాయని గ్రామస్తులు తెలిపారు. ఆదివారం గంగపూజ, గోపూజ, గణపతిపూజ, రక్షబంధం, పంచగవ్య ప్రసనర, యాగశాల ప్రవేశం, ప్రధాన కలశస్థాపన తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 29న పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట ఉంటుందన్నారు.

నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం రూరల్: శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఓ కృష్ణప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని శ్రీకృష్ణదేవరాయ రంగస్థల కళాకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నరసింహులు యాదవ్ తదితరులు తెలిపారు.

పాఠశాలకు గ్రైండర్ వితరణ

ఆత్మకూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి 1977-78 బ్యాచ్ విద్యార్థులు ఆత్మకూరులో శనివారం సమ్మేళనమయ్యారు. అనంతరం పాఠశాలకు పెద్ద గ్రైండర్‌ను వితరణ చేశారు. ఉపాధ్యాయులకు గ్రైండర్‌ను అందించారు.